








ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న వీరశైవార్చకులు

"శరణు.. శరణు.. కొమురెల్లి మల్లేశా.." అంటూ మల్లికార్జున స్వామిని స్తుతిస్తూ శివసత్తులు, పోతరాజులు, భక్తులు కణకణమని రగిలే నిప్పుల్లో చిందులేసి మైమరచి చిందులేశారు... "దేవుడు.. మల్లన్న దేవుడు..మాదేవుడు.. సారికెల్లో కొలువైనాడు.. మాదేవుడు..." అంటూ స్వామి నామస్మరణతో అశేష భక్తజనులు పులకించారు. దేవదేవుడి ఆవాహనంతో చేతిలో వీరకోలతో సిగమూగుతూ అగ్నిగుండాలు దాటి తన్మయత్వం చెందారు. భక్తిపారవశ్యంలో కొమురవెల్లి ఓలలాడింది.

కొమురెల్లి మల్లేశా..
శరణు శరణు

- మల్లన్న క్షేత్రం బండారిమయం
- ఘనంగా పట్నంవారం పెద్దపట్నం, అగ్నిగుండాలు



పెద్దపట్నం, అగ్నిగుండాలు

చేర్యాల, జనవరి 22 : కొమురవెల్లి మల్లిఖార్జునస్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభంలో భాగంగా పట్నంవారాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌కు చెందిన యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆలయతోటబావి ప్రాంగణంలో మల్లన్నకు అత్యంత వైభవోపేతంగా పెద్దపట్నం వేసి అగ్నిగుండాలు నిర్వహించారు. యాదవ పూజారులు పసుపు, కుంకుమ, పచ్చ, బియ్యంపిండి, సునేరు, పంచ రంగులతో పెద్దపట్నాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. వంటచెరుకుతో అగ్నిగుండాలను తయారు చేశారు.పెద్దపట్నానికి చిత్రకన్ను అమర్చి గుమ్మడికాయలను అష్టదిక్పాలకులకు అలంకరించారు. మల్లన్న చరిత్ర, మహిమలను వివరిస్తూ యాదవపూజారులు ఒగ్గుకథను ఆలపించగా భక్తులు జయజయధ్వానాలు చేయడంతో ఆలయపరిసరాలు ప్రతిధ్వనించాయి. భక్తిప్రపత్తులతో వేస్తున్న పట్నాన్ని తిలకిస్తూ అశేష భక్తజనం పులకించిపోయారు. భక్తులు మల్లన్నను స్మరిస్తూ బండారిని వంటినిండా ధరించడంతో ఆలయ పరి సరాలన్నీ పసుపుమయంగా మా రింది. పట్నం వేయడం, అగ్నిగుండాలను తయారు చేయడం పూర్తికాగానే గర్భాలయం నుంచి అర్చకులు మహదేవుని మల్లికార్జున్ తదితరులు ఉత్సవ విగ్రహాలను పోలీసు బందోబస్తు నడుమ తీసుకొచ్చి పట్నం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. యాదవులు గుమ్మడికాయలను బలిహరణ చేయగానే అర్చకులు అగ్నిగుండాలను దాటడం ప్రారంభించారు. అనంతరం మల్లన్నను స్మరిస్తూ అగ్నిగుండాలను దాటి స్వామివారిని దర్శించుకు న్న శివసత్తులు, భక్తులకు ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో బాలాజీశర్మ, పునరుద్ధరణ కమిటీ సభ్యులు తదితరులు కనుములు(ఆచారం) అందించి సత్కరించారు. పలువురు భక్తులు బెల్లంపానకం, నీళ్లప్యాకెట్లను, మరికొందరు అన్నదానం వితరణ చేశారు. బండారిని పంపిణీ చేశారు.



బండారి చల్లుకుంటున్న ఆచారవతులు



అగ్నిగుండం దాటుతున్న శివసత్తులు, భక్తులు



జనసంద్రమైన కొమురవెల్లి ఆలయ పరిసరాలు

శంఖం పూరిస్తున్న భక్తురాలు

పెద్దపట్నం నిర్వహణలో ఆలస్యం

- ముందస్తు భద్రత కట్టుదిట్టం
- సమయానికి చేతులెత్తేసిన పోలీసులు
- ఉత్సవ విగ్రహాలను తెచ్చేప్పుడు తోపులాట
- కిందపడ్డ పోలీసు సిబ్బంది, భక్తులు
- పలువురికి గాయాలు

7లో..

కొండపోచమ్మకు పోటెత్తిన భక్తజనం

- అమ్మవారి జాతర ప్రారంభం





వర్గల్ : వేణుగోపాలస్వామి ఆలయం వద్ద స్క్రీన్‌పై అయోధ్యలో జరిగే కార్యక్రమాన్ని తిలకిస్తున్న భక్తులు





ప్రత్యేక అలంకరణలో కుకునూరుపల్లి రామాలయంలోని రాముడు

అంతా రామమయం

అయోధ్యలో రాముడి ప్రాణపతిష్ఠ సందర్భంగా జిల్లాలోని రామాలయాల్లో ప్రతేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల ర్యాలీలు తీశారు. అయోధ్యలో జరిగే కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించడానికి పెద్ద స్క్రీన్లను ఏర్పాటు చేశారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.



వర్గల్‌లో నిర్వహించిన సీతారాముల శోభాయాత్ర



చేర్యాలలో ఓ ఇంటి ముందు వెలిగించిన దీపాలు



పిడ్‌చెడ్‌లో హనుమాన్ శోభాయాత్ర



వర్గల్‌లో శోభాయాత్రలో చిన్నారి

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్
- ప్రజావాణికి 16 దరఖాస్తులు



అర్జీదారుల నుంచి వినతులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 22 : ప్రజావాణి గొప్ప కార్యక్రమం. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ పేర్కొన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఆమె దరఖాస్తులను స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనేక మంది ఎంతో నమ్మకంతో తమ సమస్యల పరిష్కారానికి ఇక్కడి వరకు వస్తారని, అలా వచ్చిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని ఆమె అధికారులకు సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి తప్పనిసరిగా అధికారులు హాజరుకావాలని స్పష్టం చేశారు. భూ సంబంధిత, ఆసరా పింఛన్లు, ఇతరత్రా మొత్తం కలిపి 16 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సదరం క్యాంపు స్లాట్ దొరకడం లేదు

- ఉప్పలయ్య, మర్రిముచ్చల



సదరం క్యాంపు స్లాట్లు దొరకడం లేదని చేర్యాల మండలంలోని మర్రిముచ్చల గ్రామానికి చెందిన ఉప్పలయ్య ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. సదరం క్యాంపు పెడుతున్నట్టు తెలిసి మీసేవకు వెళ్లే లోపే క్యాంపు స్లాట్లు అయిపోతున్నాయని వాపోయాడు. సదరం క్యాంప్ స్లాట్ కోసం అధికారులను సైతం సంప్రదించానని స్పందన లేదని అదనపు కలెక్టర్‌కు విన్నవించాడు.

భూమిని రిజిస్ట్రేషన్ చేయాలంటూ కొడుకు, కోడలు కొడుతున్నారు

- రిటైర్డ్ వీఆర్వో లింగారెడ్డి భాగ్యలక్ష్మి దంపతులు



"నాకు ముగ్గురు కొడుకులు. వారికి సమానంగా ఒక్కొక్కరికీ ఆరు ఎకరాలకు పైగా భూమిని పంచాను. మరో మూడు ఎకరాల భూమి మాపేర ఉంది. ఆ భూమిని కూడా వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలంటూ చిన్న కొడుకు రాంగోపాల్‌రెడ్డి, కోడలు అరుంధతి కొడుతున్నారు." అని నంగునూరు మండలంలోని ఖానాపూర్‌కు చెందిన రిటైర్డ్ వీఆర్వో లింగారెడ్డి భాగ్యలక్ష్మి దంపతులు ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. వారిపై రాజగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశామని తెలిపారు. ఆ భూమిలో సాగుచేసుకోవడానికి వెళ్లనివ్వడం లేదని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తమకు ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని ఆ దంపతులు అదనపు కలెక్టర్‌ను కోరారు.

మత్తు పదార్థాలపై ఉక్కుపాదం : మంత్రి దామోదర్

సంగారెడ్డి టౌన్, జనవరి 22 : గుడుంబా, గంజాయి వంటి మత్తు పదార్థాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. సంగారెడ్డిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎక్సైజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ జిల్లాలో గుడుంబా తయారీ, విక్రయాలు, గంజాయి రవాణా, అమ్మకాలపై గట్టి నిఘా పెట్టాలన్నారు. ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకొని గుడుంబా, గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉమ్మడి మెదక్ జిల్లా డిప్యూటీ కమిషనర్ హరికిషన్, రఘురాం పాల్గొన్నారు.



ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

తూప్రాన్ అంగన్‌వాడీ కోడిగుడ్లు..
వికారాబాద్ జిల్లాలో అమ్మకం

తూప్రాన్, జనవరి 22: తూప్రాన్ అంగన్‌వాడీ కోడిగుడ్లు వికారాబాద్ జిల్లాలో అమ్ముతున్న ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల పరిధి మందిపాల్ గ్రామానికి చెందిన డీసీఎం వాహన డ్రైవర్ పెంటయ్య చౌడాపూర్ మండల కేంద్రంలో ఒక్కో కోడిగుడ్డ రూ.5కు విక్రయిస్తుండగా అక్కడి గ్రామ పంచాయతీ కార్యదర్శి గుర్తించి తహసీల్దార్ ప్రభుకు ఫిర్యాదు చేశాడు. విచారించి గుడ్లపై ఉన్న గుర్తుల ఆధారంగా అంగన్‌వాడీ కేంద్రానికి ప్రభుత్వం పంపిణీ చేసినవిగా తేల్చారు. పెంటయ్యను విచారించగా తూప్రాన్ పట్టణ సమీపంలో రైల్వేగేటు వద్ద వెంకటేశ్ అనే వ్యక్తి కోడిగుడ్లు ఇచ్చినట్లు తెలిపాడు. 1500 కోడిగుడ్లను తీసుకురాగా, 21 ట్రేలలో మిగిలి ఉన్న 630 గుడ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంలో తూప్రాన్ ఐసీడీఎస్ సీడీపీవో హేమభార్గవిని వివరణ కోరగా తమకు తెలియదని పేర్కొన్నారు. ఫిర్యాదు చేస్తామని తెలిపారు. తూప్రాన్ కోడిగుడ్ల విక్రయం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

ఓటర్ల అవగాహనకు చైతన్య రథం

సంగారెడ్డి రూరల్: ఈ నెల 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఓటర్లకు అవగాహన కల్పించేందుకే ఓటరు చైతన్య రథాన్ని ప్రారంభించామని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం ఓటరు చైతన్య రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తుందని పేర్కొన్నారు. సాంస్కృతిక సారథి కళాకారులు అవగాహన కల్పిస్తారని వెల్లడించారు. ఓటరు నమోదు ప్రత్యేక శిబిరానికి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. ఫారం - 6కు 4,509, ఫారం - 7కు 924, ఫారం - 8కి 1,653 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లాలో బీజేపీని బలోపేతం చేస్తా

సంగారెడ్డి అర్బన్, జనవరి 22: జిల్లాలో సమన్వయంతో పార్టీని బలోపేతం చేస్తానని సంగారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి తెలిపారు. నూతన జిల్లా అధ్యక్షురాలిగా ఆమె సోమవారం సంగారెడ్డి చౌరస్తా సమీపంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ అందరిని కలుపుకుపోయేలా బాధ్యతలు నిర్వర్తిస్తానన్నారు. జిల్లాలోని మెదక్, జహీరాబాద్ రెండు ఎంపీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి రాష్ట్ర నాయకత్వానికి గిఫ్ట్‌గా ఇస్తానన్నారు. అనంతరం పలువురు నాయకులు, కార్యకర్తలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో జిల్లా సహ ఇన్‌చార్జి రామకృష్ణ, రాష్ట్ర నాయకులు జగన్, పులిమామిడిరాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ రాజుగౌడ్, జైపాల్‌రెడ్డి, జిల్లా నాయకులు మహేందర్, వెంకటనర్సింహారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పోచారం రాములు, నాయకులు దోమల విజయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ సంగారెడ్డి కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరిస్తున్న గోదావరి అంజిరెడ్డి

రాముడి పల్లకీసేవలో ఉద్రిక్తత

- బూటు విసిరిన ఓ దుండగుడు
- నిందితుడి ఇంటి ముందు రామభక్తుల ఆందోళన, బైఠాయింపు
- రంగంలోకి దిగిన జిల్లా ఎస్పీ రూపేష్
- నిందితుడిని, కుటుంబసభ్యులను తరలించిన పోలీసులు



హత్నూర మండలం దౌల్తాబాద్‌లో అనుమానితుడి ఇంటి ముందు ఆందోళన చేస్తున్న రామభక్తులు

హత్నూర, జనవరి 22: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్‌లో సోమవారం రాత్రి శ్రీరాముని పల్లకీసేవ ఊరేగింపులో ఉద్రిక్తత చోటు చేసుకున్నది. ఓ ఇంటి పైనుంచి పల్లకిపై కాలిబూటు పడడంతో ర్యాలీలో పాల్గొన్న రామభక్తులు ఆగ్రహానికి గురయ్యారు. ఏ ఇంటి నుంచి బూటు పడిందో ఆ ఇంటిలోకి వెళ్లిన భక్తులు అలాంటిదే మరో కాలిబూటును గుర్తించారు. ఉద్దేశ్యపూర్వకంగానే విసిరారని నిర్ధారించుకుని ఆ ఇంటి వద్ద ఆందోళనకు దిగారు. రాముడి పల్లకీ ఊరేగింపులో బూటు పడిన విషయం తెల్సుకున్న చుట్టుపక్కల గ్రామాల నుంచి రామభక్తులు వెంటనే పెద్ద సంఖ్యలో దౌల్తాబాద్‌కు చేరుకుని ఆందోళనలో పాల్గొన్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు ఎంత నచ్చజెప్పినా ఆందోళన విరమించకపోవడంతో సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్‌తో పాటు పటాన్‌చెరు డీఎస్పీ, జిన్నారం, సంగారెడ్డి, పటాన్‌చెరు సీఐలు, ఆయా మండలాల ఎస్ఐలు, పోలీసు బలగాలు దౌల్తాబాద్‌కు చేరుకున్నారు. రామభక్తులను సముదాయించారు. అయినా వారు పట్టువిడవకుండా రోడ్డుపై బైఠాయించారు. బూటు విసిరిన వ్యక్తి ఇంటిపై రాళ్లతో దాడికి పాల్పడ్డారు. ఓ పండ్ల దుకాణాన్ని దగ్ధం చేశారు. పోలీసులు అనుమానితుడిని భారీ బందోబస్తు మధ్య పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆయన కుటుంబసభ్యులను గ్రామం నుంచి తీసుకెళ్లారు. రెండు గంటల పాటు శ్రమించి రామభక్తులను చెదరగొట్టారు. ఉద్రిక్తతలను నివారించేందుకు గ్రామంలో సుమారు 200 మంది పోలీసులు పహారా కాస్తున్నారు.

పెద్దపట్నం నిర్వహణలో ఆలస్యం

- ఉత్సవ విగ్రహాలను తీసుకువస్తుండగా తోపులాట
- సమయానికి చేతులెత్తేసిన పోలీసులు
- కిందపడిపోయిన పోలీసు సిబ్బంది, భక్తులు
- పలువురికి గాయాలు



ఉత్సవ విగ్రహాలను తీసుకువస్తుండగా తోటబావి ప్రధాన ద్వారం వద్ద తోపులాటలో కిందపడిపోయిన భక్తులు, పోలీసు సిబ్బంది

చేర్యాల, జనవరి 22: కొమురవెల్లి మల్లన్న పట్నంవారాన్ని పురస్కరించుకుని ఆలయ తోటబావి ప్రాంగణంలో సోమవారం పెద్దపట్నం, అగ్నిగుండాలు ఆలస్యంగా చేపట్టడంతో గందరగోళ పరిస్థితి నెలకొన్నది. యేటా హైదరాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో పెద్దపట్నం, అగ్నిగుండాలు నిర్వహిస్తుండటం ఆనవాయితీగా వస్తున్నది. ఈ క్రమంలో భక్తులు భారీగా తరలివచ్చినప్పటికీ సమన్వయలోపంతో నిర్ణీత సమయాని కన్నా గంటకుపైగా ఆలస్యమైంది.

ముందస్తు కట్టుదిట్టం.. తీరా చేతులెత్తేసిన పోలీసులు





తోపులాటలో ఇనుపచువ్వ తగలడంతో గాయపడిన భక్తురాలు, అస్వస్థతకు గురైన భక్తురాలికి చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

భారీ సిబ్బందితో పోలీసులు ముందస్తుగా కట్టుదిట్ట భద్రతా చర్యలు తీసుకున్నా ప్రధాన సమయంలో చేతులెత్తేశారు. కవరేజీకి వచ్చిన మీడియా జర్నలిస్టులను తోటబావి ప్రాంగణంలోనికి అనుమతించడానికి అడ్డంకులు పెట్టినప్పటికీ కొంతమంది గుర్తింపులేని అనధికార వ్యక్తులను ఇష్టానుసారం లోపలికి పంపించారు. పట్నం రచించి అగ్నిగుండాలు పూర్తయిన వెంటనే ఆలయం నుంచి దేవతామూర్తుల విగ్రహాలను తీసుకొస్తున్న క్రమంలో తోటబావి ప్రధాన ద్వారం ఆవరణలో తోసుకురావడంతో ఒక్కసారిగా భక్తులు, పోలీసులు కిందపడిపోయారు. అర్చకులు ఉత్సవమూర్తులతో పట్నం, అగ్నిగుండాల చుట్టూ ప్రదక్షిణలు చేయడంలో తీవ్ర ఇబ్బందులుపడ్డారు. అనధికార వ్యక్తులు అధికంగా లోపలికి చొచ్చుకువచ్చినా పట్టించుకోకపోవడంతో అగ్నిగుండాలు దాటడంలో గందరగోళం నెలకొన్నది.

పలువురికి గాయాలు

తోటబావి ప్రధాన ద్వారం వద్ద భక్తులను నిలువరించకపోవడంతో పలువురు కిందపడి గాయాలపాలయ్యారు. హైదరాబాద్‌కు చెందిన మంజుల నుదుటికి గాయమై రెండు కుట్లుపడ్డాయి. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన లక్ష్మి, మాధవి, మంజుల ఊపిరాడక స్పృహ కోల్పోయారు. ఇబ్రహీంపట్నంకు చెందిన కనకరాజు కాలు విగిరింది. కొమురవెల్లి పీహెచ్‌సీ సిబ్బంది ప్రాథమిక వైద్యసేవలందించారు. కాలు విరిగిన కనకరాజును ఉన్నతాస్పత్రికి తరలించారు.

ఎటుచూసినా చెత్త, వ్యర్థాల కుప్పలే

పారిశుద్ధ చర్యల నిర్వహణలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. భక్తులు బసచేసిన ఆలయ సమీపంలోని ఆరుబయట పరిసరాలలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో దుర్వాసన వెదజల్లడంతో చుట్టుపక్కలవారు ఇబ్బందులుపడ్డారు.

తోటబావి జనరేటర్ రూములో మద్యం సేవింపు!?

కొమురవెల్లి మల్లన్న ఆలయ తోటబావి ఆవరణలోని జనరేటర్ రూములో పలువురు ఆలయ సిబ్బంది మద్యం సేవిస్తూ జల్సాలకు వినియోగించుకుంటున్నారు. సోమవారం తోటబావి ప్రాంగణంలో పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో ఒకరిద్దరు వాలంటీర్లతో పాటు ఆలయ సిబ్బంది మద్యం సేవించడాన్ని పలువురు గమనించారు. లోపలికి వెళ్లేసరికే ఒక్కసారిగా పరుగు పెట్టడంతో ఆలయాధికారులకు తెలిపారు. జాతర సందర్భంగా భక్తులకు సేవలందించేందుకు తాత్కాలికంగా వాలంటీర్లను నియమించినప్పటికీ ఎక్కడా సక్రమంగా పనిచేయడం లేదు. ఎవరు ఎక్కడ విధులు చేస్తున్నారో తెలియడం లేదు. కొంతమందిని పునరుద్ధరణ కమిటీ సభ్యులకు సేవలందించడానికి పరిమితం చేసుకోగా, మరికొంతమంది దర్శనాల పేరిట భక్తులనుంచి డబ్బులు వసూలు చేస్తుండడం వివాదాస్పదమవుతున్నది. జాతర మరో 11 వారాలు కొనసాగనున్న క్రమంలో ఆలయవర్గాలు పునరాలోచించి వాలంటీర్ల వినియోగంపై దృష్టిసారించి జల్సాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మెదక్‌లో దారుణం

- తమ్ముని ప్రేమ వివాహం.. అన్న దారుణ హత్య
- కత్తితో యువతి సోదరుడు ఘాతుకం
- మెదక్ జిల్లా కేంద్రంలో ఘటన



హత్యకు గురైన నగేష్(ఫైల్)

మెదక్ అర్బన్, జనవరి 22: మెదక్ జిల్లా కేంద్రంలో దారుణం చోటు చేసుకున్నది. తమ్ముడు ప్రేమ వివాహం చేసుకున్న గంటల వ్యవధిలో అన్న దారుణహత్యకు గురైన సంఘటన పట్టణంలో సోమవారం రాత్రి జరిగింది. నవాబుపేటకు చెందిన పోత రాజ్‌నగేష్(25) తమ్ముడు ఉదయ్‌పాల్ అదే వీధికి చెందిన ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఇద్దరు ఒకే సామాజిక వర్గానికి చెందినా ఇరు కుటుంబాలు పెళ్లికి అంగీకరించలేదు. దాంతో ఉదయ్‌పాల్, అమ్మాయి భవానీ ఇంటి నుంచి వెళ్లిపోయి హైదరాబాద్‌లో వివాహం చేసుకున్నారు. పెళ్లి ఫొటో వాట్సాప్ స్టేటస్ పెట్టారు. దాంతో ఆగ్రహించిన భవానీ సోదరుడు అంజిత్ యువకుడి ఇంటికి వెళ్లి ఉదయ్‌పాల్ అన్న నగేష్‌పై కత్తితో దాడిచేశాడు. తీవ్రంగా గాయపడిన నగేష్ అక్కడికక్కడే మృతిచెందగా.. మృతుడి తండ్రి యాదగిరి, మరో అన్న సాయికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. నగేష్ హత్యకు ప్రేమ వివాహమే కారణంగా పోలీసులు భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.



కొండపోచమ్మ అమ్మవారు



కొండపోచమ్మ ఆలయం ముందు భక్తుల సందడి

కొండపోచమ్మకు పోటెత్తిన భక్తజనం

- ఘనంగా అమ్మవారి జాతర ప్రారంభం
- కొమురవెల్లి నుంచి కొండపోచమ్మకు తరలిన భక్తులు

జగదేవ్‌పూర్, జనవరి 22: కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నం కొండపోచమ్మను దర్శించుకోవడానికి వాహనాల్లో బారులుతీరారు. సోమవారం సాయంత్రానికి భక్తులు పోటీ పడి అమ్మా బైలెల్లినాదో.. తల్లి పోచమ్మ బైలెల్లినాదో అంటూ భక్తులు పాటలు పాడుతూ జాతరలో పాల్గొన్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని తీగుల్ నర్సాపూర్ గ్రామ సమీపంలో గల కొండపోచమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం కొమురవెల్లి మల్లన్న ఆలయం వద్ద అగ్నిగుండాలు, పెద్దపట్నం చూసి భక్తులు కొండపోచమ్మ దర్శనానికి బయలుదేరారు. ఆలయానికి వచ్చిన భక్తులు కొత్త కుండల్లో నైవైద్యం వండి బోనాన్ని తయారుచేసి డప్పు చప్పుళ్ల మధ్య పోతరాజుల నృత్యాలు, శివసత్తుల శిగాల మధ్య అమ్మవారి చెంతకు చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి బోనాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేల సంఖ్యలో భక్తులు కొండపోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఏసీపీ రమేష్, సీఐ జానకీరాంరెడ్డి, ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సమస్యలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. సోమవారం సాయంత్రం కొండపోచమ్మ ఆలయం వద్ద ధూందాం నిర్వహించారు. పోతరాజుల వేషాలు, మహిళల బోనాల సందడి మధ్య అంగరంగ వైభవంగా పోచమ్మతల్లి ఆటపాటలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు.



బోనంతో మహిళ



పోతరాజుల విన్యాసాలు

ఉదయం అంతంత మాత్రంగానే ఉన్న భక్తులు సాయంత్రం వేల సంఖ్యలో తరలివచ్చారు. మంగళవారం కూడా భక్తుల తాకిడి పెరిగే అవకాశం ఉన్నదని ఆలయ ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. స్థానిక సర్పంచ్ రజితారమేష్, ఆలయ సిబ్బంది భక్తులకు ఇబ్బందులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

10 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న వాహనాలు

జహీరాబాద్, జనవరి 22: జహీరాబాద్‌లోని వెంకటరమణ కాలనీలో అక్రమంగా తరలిస్తున్న 10 టన్నుల రేషన్ బియ్యాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. జహీరాబాద్‌కు చెందిన హర్షద్ బీదర్‌కు చెందిన గుండప్పకు సేకరించిన రేషన్‌బియ్యాన్ని అమ్ముతున్నాడు. పక్కా సమాచారం అందుకున్న అధికారులు అక్కడికి వెళ్లి డీసీఎం, బొలెరో వాహనాలను తనిఖీ చేయగా.. అందులో రేషన్ బియ్యం ఉన్నాయన్నారు. ఈ మేరకు వాహనాల డ్రైవర్లు బోయిని నారాయణ(జహీరాబాద్), పరమేష్(కాసీంపూర్), బానోత్‌రాజు(మందగుబ్బడితండా), సలావుద్దీన్(శాంతినగర్)లతోపాటు క్రయ, విక్రయదారులు హర్షద్, గుండప్పలను, బియ్యం వాహనాలను అదుపులోకి తీసుకుని జహీరాబాద్ పట్టణ పోలీసులకు అప్పగించామన్నారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి



మృతిచెందిన గాండ్ల విఠల్

అల్లాదుర్గం, జనవరి 22: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండలంలోని చిల్వెర్ గ్రామానికి చెందిన గాండ్ల విఠల్(46) ముస్లాపూర్ నుంచి గడిపెద్దాపూర్ గ్రామానికి వెళ్తున్న క్రమంలో గ్రామ శివారులోని 161వ జాతీయ రహదారిలో సోమవారం ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో విఠల్ తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే అతడిని జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు.

అంకితభావంతో పని చేయాలి: మెదక్ ఎస్పీ

మెదక్ అర్బన్, జనవరి 22: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని జిల్లా ఎస్పీ బాలస్వామి సూచించారు. సోమవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా సాయుధ దళాల వార్షిక పునశ్చరణలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఏఆర్ అధికారులు, సిబ్బంది పనితీరు శ్లాఘనీయమన్నారు. సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు, వారిని కొత్త సవాళ్ల స్వీకరించేందుకు సమాయత్తం చేసేందుకు ఈ శిక్షణ విధి నిర్వహణలో దోహదపడుతుందన్నారు. అనంతరం సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మహేందర్, ఏఆర్ డీఎస్పీ రంగనాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ముగ్గురి ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

సిద్దిపేట టౌన్, జనవరి 22: తెలంగాణ టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయస్థాయి టెన్నికాయిట్ ఎంపిక పోటీల్లో అండర్-18 జూనియర్స్ బాలికల విభాగంలో సిద్దిపేట జిల్లా నుంచి ముగ్గురు ఎంపికైనట్లు టెన్నికాయిట్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కాటం శ్రీనివాస్, కార్యదర్శి క్యాతం రాజ్‌కుమార్ తెలిపారు. వీరిలో సృజన (వర్గల్ ఎంజేపీ), సంజన (రెసిడెన్షియల్ స్కూల్ ఎన్సాన్‌పల్లి), బాలుర విభాగంలో ఆకాష్ (సిద్దిపేట) ఎంపికయ్యారు. పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరి 6 నుంచి 10 వరకు రాజస్థాన్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. వీరికి శిక్షకులుగా వెంకటేష్ వ్యవహరించనున్నారు. జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులను పలువురు అభినందించారు.

24 నుంచి మోతీమాత జాతర

- సంగారెడ్డి జిల్లాలోనే గిరిజనుల పెద్ద పండుగ
- ఏర్పాట్లు చేసిన ఉత్సవ కమిటీ సభ్యులు

జహీరాబాద్, జనవరి 22: సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం ఉప్పర్‌పల్లి పంచాయతీ పరిధిలోగల మోతీమాత జాతర ఈనెల 24, 25న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఉత్సవకమిటీ గౌరవ అధ్యక్షుడు కిషన్‌రావ్‌పవార్, ఆలయ చైర్మన్ రాంశెట్టి, ప్రధాన కార్యదర్శి దేవిదాస్, ఉపాధ్యక్షుడు పవన్‌రాథోడ్ తదితరులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 24 ధ్వజారోహణం, 25న ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. సంగారెడ్డి జిల్లాలోనే అతి పెద్ద గిరిజన జాతర అని పేర్కొన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశామని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎన్ డైరెక్టర్ శంకర్‌నాయక్, ఉత్సవకమిటీ సభ్యులు నాగిశెట్టిరాథోడ్, నారాయణ, లింబాద్రి, ఉమేష్‌లాల్, కేమసింగ్, తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేట అర్బన్ మండలం గాంధీనగర్‌లో పూజ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు


సిద్దిపేట రూరల్ మండలం చిన్న గుండవెల్లిలో ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్థులు


నారాయణరావుపేట రామాలయంలో భజన, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు


మిరుదొడ్డిలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

మార్మోగిన రామనామం


వర్గల్ మండల కేంద్రంలో నిర్వహించిన శ్రీ సీతారాముల శోభాయాత్ర

అయోధ్యలో రాంలల్లా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపనోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక సందడి నెలకొన్నది. వీధులు రామనామంతో మార్మోగాయి. ఆలయాల్లో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. కాషాయ జెండాలతో శోభాయాత్రలు నిర్వహించారు. మహిళలు వాకిళ్లను ముగ్గులతో అలంకరించి, ఇంట్లో దీపాలు వెలిగించి పండుగలా జరుపుకున్నారు. పలుచోట్ల అయోధ్యలో జరిగే కార్యక్రమం ప్రత్యక్షప్రసారాన్ని వీక్షించడానికి పెద్ద స్క్రీన్లను ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.


కొండపాక: మర్పడగ క్షేత్రంలో సీతారాముల కల్యాణం


మద్దూరు: రేబర్తిలో రామాలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న మహిళలు


దుబ్బాకలో ప్రధాన వీధుల గుండా సీతారాముల శోభాయాత్రను నిర్వహిస్తున్న భక్తులు

సిద్దిపేట అర్బన్/సిద్దిపేట రూరల్, జనవరి 22: సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల, పొన్నాల, భట్టి రామన్నపల్లి ,నాంచార్‌పల్లి, ఎన్సాన్‌పల్లి, ఎల్లుపల్లి, బొగ్గులోని బండ, మిట్టపల్లి, తడకపల్లి గ్రామాల్లో రాములవారి ఆంజనేయ ఆలయాల వద్ద ప్రత్యేక పూజలతో పాటు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సిద్దిపేట రూరల్ మండలంలోని చిన్నగుండవెల్లి, ఇరుకోడ్, తోర్నాల, పుల్లూరు, రాఘవపూర్ తదితర గ్రామాల్లో శ్రీసీతారాముల విగ్రహాలతో వీధుల గుండా భారీగా ర్యాలీ నిర్వహించారు.

● **వర్గల్:** వర్గల్ మండల కేంద్రంలో గ్రామ భక్త బృందం ఆధ్వర్యంలో సోమవారం సీతారాముల శోభాయాత్ర నిర్వహించారు. శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం నుంచి సీతారాముల దేవతా మూర్తులను పుష్పరథంపై అధిష్ఠింపజేసి వేద మంత్రాలు, కోలాటాలు, భక్తుల భజనల మధ్యన బాణసంచా కాలుస్తూ ఊరేగింపు కొనసాగింది. వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో వేదికపై శ్రీసీతారాముల దేవతామూర్తులకు పూజలు నిర్వహించి అక్షంతలు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణంలో అయోధ్య కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారం కోసం భారీ స్క్రీన్ ఏర్పాటు చేసి, భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో విద్యా సరస్వతీ ఆలయం ప్రధాన ద్వారం వద్ద శ్రీ సీతారాముల దేవత మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **నారాయణరావుపేట:** మండలంలోని జక్కాపూర్, నారాయణరావుపేట, లక్ష్మీదేవిపల్లి, గోపులాపూర్, గుర్రాలగొంది లతో పాటు అయా గ్రామాల్లో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. మాటిండ్ల ఆర్‌డీఎఫ్ పాఠశాలలో విద్యార్థులకు శ్రీ రాముడి జీవన విధానాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విష్ణుమూర్తి వివరించారు.

● **నంగునూరు:** మండల కేంద్రంలో సోమవారం రాములోరి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీరామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరాముని నామంతో వీధులన్నీ మార్మోగాయి. నంగునూరు అంబేడ్కర్ సర్కిల్ వద్ద అయోధ్యలో జరిగే ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షించేందుకు భారీ ఎల్‌ఈడీ తెరను ఏర్పాటు చేశారు. గ్రామ గ్రామాన అన్నదానం కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికి కాషాయ జెండా కట్టారు.

● **దుబ్బాక/మిరుదొడ్డి:** దుబ్బాక, మిరుదొడ్డి,అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రాల్లో సోమవారం దుబ్బాక వీరాంజనేయ, శ్రీవెంకటేశ్వరాలయం, మిరుదొడ్డిలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం, మోతె శ్రీవెంకటేశ్వరాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు వివిధ మండలాల్లోని అన్ని గ్రామాల్లో పల్లకి సేవపై స్వామి వారిని ఊరేగించారు. కార్యక్రమంలో తీర్థ క్షేత్ర ట్రస్ట్ కన్వీనర్ కానుంటి శ్రీనివాస్, దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనితాభూంరెడ్డి, కౌన్సిలర్లు, ఆయాగ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

● **చేర్యాల:** చేర్యాల పట్టణంలోని రామాలయంలో సామూహిక శ్రీరామతారకమంత్ర పఠనం, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. స్థానిక వివేకానంద పురి కాలనీలో వివేకానందుడి విగ్రహావరణలో మిఠాయిలు పంపిణీ చేశారు. ప్రజలు సాయంత్రం తమ ఇళ్లతో పాటు పట్టణంలోని ఆలయాల్లో దీపాలు వెలిగించారు. దొమ్మాట గ్రామంలోని రామాలయంలో నిర్వహిస్తున్న దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలలో సోమవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యే పల్లాకు స్వాగతం పలికారు. అదేవిధంగా అయోధ్య సంబరాలను పట్టణంలోని సూపర్‌గ్యాంగ్ మహిళాసంఘం సభ్యులు ఘనంగా జరిపారు.

● **గజ్వేల్/గజ్వేల్ రూరల్:** గజ్వేల్, ప్రజ్ఞాపూర్, క్యాసారంతో పాటు గజ్వేల్ మండలంలోని ఆయా గ్రామాల్లో శ్రీరాముని శోభాయాత్ర నిర్వహించారు. గజ్వేల్ పట్టణంలోని అంగడిపేట హనుమాన్ ఆలయం నుంచి శ్రీసీతారామ, ఉమామహేశ్వరాలయం వరకు శ్రీరాముడి ప్రతిమతో శోభాయాత్రను నిర్వహించారు. ప్రజ్ఞాపూర్‌లో శ్రీరాముని ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. సీతారామాలయంలో, పట్టణంలోని వేంకటేశ్వరాలయంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేసి అయోధ్య కార్యక్రమాల ప్రత్యక్షప్రసారాలను భక్తులకు వీక్షింపజేశారు. ఆయా దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని పిడిచెడ్ గ్రామ పురవీధుల్లో హనుమాన్, రాముడి శోభాయాత్ర నిర్వహించారు.

● **హుస్నాబాద్‌రూరల్:** హుస్నాబాద్ పట్టణంలోని సీతారామ ఆలయంలో అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని భక్తులు తిలకించారు. పట్టణంలోని సిద్దార్థ, ఆల్‌ఫోర్స్ హైస్కూల్ విద్యార్థులు అంబేడ్కర్ చౌరస్తాలో ప్రదర్శించిన బాల రామాయణ నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. రామాలయంలోని వివిధ వేషాదరణలతో విద్యార్థులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సీతా రామచంద్రస్వాముల చిత్రపటాల వద్ద పూజలు చేపట్టి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పందిల్ల, పొట్లపల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని గాంధీచౌక్‌లో కరసేవకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, ఫ్లోర్‌లీడర్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

● **చిన్నకోడూరు:** మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణం, అన్నదాన వితరణ, శోభాయాత్ర తదితర కార్యక్రమాలు చేపట్టారు.

● **మద్దూరు:** మద్దూరు, దూళిమిట్ట మండలాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహహించారు. అయోధ్య కార్యక్రమాన్ని తిలకించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. అంతకు ముందు ఆయా గ్రామాల్లో బైక్‌ర్యాలీతో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● **కొండపాక:** మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద స్క్రీన్లు పెట్టి అయోధ్య కార్యక్రమాల ప్రత్యక్షప్రసారాన్ని వీక్షింపజేశారు. మర్పడగ గ్రామంలోని శ్రీ విజయ దుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో సోమవారం శ్రీ సీతారామ కల్యాణోత్సవం వైభవోపేతంగా జరిగింది. క్షేత్ర నిర్వాహకులు డాక్టర్ చెప్పెల హరినాథ శర్మ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు గ్రామంలోని రావిచెట్టు హనుమాన్ ఆలయం నుంచి ఉత్సవమూర్తులకు మేళతాళాలతో పల్లకిలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం వేదోక్తంగా కల్యాణోత్సావాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కొండపాక రామాలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కుకునూరుపల్లిలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకం చేశారు. గ్రామంలో శ్రీరామచంద్రస్వామి రథయాత్ర కోలాటాలు, భజనలతో నిర్వహించగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. శివాజీ యూత్ వారి ఆధ్వర్యంలో పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు.


చేర్యాలలో శ్రీరామలల్లా వేడుకలలో పాల్గొన్న సూపర్‌గ్యాంగ్ మహిళాసంఘం సభ్యులు


గజ్వేల్ పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు


హుస్నాబాద్‌లో బాల రామాయణ నాటక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు


చిన్నకోడూరు: శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

అయోధ్యకు రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడం హేయనీయం

గజ్వేల్, జనవరి 22: అయోధ్య రామమందిరం ప్రారంభానికి రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడం హేయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ సభ్యుడు నెంటూరు కుమార్ విమర్శించారు. గజ్వేల్ పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారతీయ జనతాపార్టీ తీరు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టన్నారు. సాక్షాత్తు భారత ప్రథమ పౌరురాలు, గిరిజన బిడ్డ అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అయోధ్య రామమందిరం పునఃప్రారంభోత్సవానికి ఆహ్వానం లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఇది ఆమెకు జరిగిన అవమానం కాదని, భారత దేశంలోని దళిత, గిరిజన బిడ్డకు జరిగిన ఘోర అవమానంగా భావిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీని ప్రజాక్షేత్రంలో దోషిగా నిలబెడుతామన్నారు.

వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి



యువతకు డ్రైవింగ్ లైసెన్సుల పంపిణీ సందర్భంగా మాట్లాడుతున్న మున్సిపల్‌మాజీ చైర్మన్ రాజనర్సు

సిద్దిపేట టౌన్, జనవరి 22: వాహనాలను నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీట్ బెల్టు, హెల్మెట్ ధరించాలని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు సూచించారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని ఆర్టీవో కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా అందజేస్తున్న డ్రైవింగ్ లైసెన్స్ కార్యక్రమంలో పాల్గొని 150 మంది యువతీయువకులకు లైసెన్స్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు రోడ్డు నియమాలను పాటించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. రోడ్డు భద్రతను నిర్లక్ష్యం చేయద్దని సూచించారు. ప్రమాదాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తూ చైతన్యపరిచేందుకే ఆర్టీవో అధికారులు రహదారి భద్రత వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేస్తున్నారని, అందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐ కవిత, అధికారులు, కౌన్సిలర్ హర్షద్, బీఆర్ఎస్ నాయకులు బందారం రాజు, రజినీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● **హుస్నాబాద్‌రూరల్:** చదువుతో పాటు విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలని హుస్నాబాద్ ఎంవీఐ టి. జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని ఆల్‌ఫోర్స్ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డుపై వెళ్తున్నప్పుడు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తదితరులు ఉన్నారు.


హుస్నాబాద్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ

దుబ్బాక రహదారులకు నిధులివ్వండి

● మంత్రి కోమటిరెడ్డిని కోరిన దుబ్బాక ఎమ్మెల్యే


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జనవరి 22: దుబ్బాక నియోజకవర్గంలోని పలు గ్రామాల రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించాలనీ దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సోమవారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి విన్నవించారు. దుబ్బాక మండలం తిమ్మాపూర్ నుంచి కొండాపూర్, దౌల్తాబాద్- మెట్టు వరకు 23 కోట్లతో రహదారి అభివృద్ధిని చేపట్టాలనీ కోరారు. అంతేగాక మొండిచింత నుంచి బేగంపేట వరకు రూ.7కోట్ల వ్యయంతో రహదారి విస్తరణ పనులను చేపట్టాలని కోరారు. చేగుంట-బోనాల రహదారి కోసం రూ.70 లక్షలు మంజూరు చేయాలనీ ఆయనకు విన్నవించారు. అందుకు మంత్రిసానుకూలంగా స్పందించారు. దుబ్బాక రహదారుల అభివృద్ధికి తనవంతుగా సహకారం అందిస్తానని హామినిచ్చారు. ఈ సందర్భంగా మంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

దేవులపల్లికి జాతీయ సాహిత్య పురస్కారం


జాతీయ సాహిత్య పురస్కారం అందుకుంటున్న దేవులపల్లి రమేశ్

నంగునూరు, జనవరి 22: హైదరాబాద్‌లోని త్యాగరాయగాన సభలో 127వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో భాగంగా నంగునూరుకు చెందిన దేవులపల్లి రమేశ్‌కు జాతీయ సాహిత్య పురస్కారం లభించింది. సోమవారం శ్రీశ్రీ కళావేదిక, అంతర్జాతీయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సాహితీ సౌరభాలు కవి సమ్మేళనంలో చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, కన్వీనర్, రమావతి, జాతీయ మహిళా అధ్యక్షురాలు లలిత చేతుల మీదుగా కవి దేవులపల్లి రమేశ్ సాహిత్య సేవలు అందిస్తున్నందుకు ఘన సన్మానం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుస్నాబాద్‌రూరల్, జనవరి 22: హుస్నాబాద్ పట్టణంలోని 33కేవీ వాటర్ గ్రిడ్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం 2నుంచి 5 గంటల వరకు హుస్నాబాద్ 132/కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని మున్సిపల్, హుస్నాబాద్ మండలం, అక్కన్నపేట మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సంబంధిత విద్యుత్ అధికారులు సోమవారం తెలిపారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆటో.. ఒకరు మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు

సిద్దిపేట క్రైం, జనవరి 22 : ఆటోలో వేగంగా ప్రయాణిస్తూ ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. సిద్దిపేట పట్టణ శివారులోని రాజీవ్ రహదారి రంగీలా దాబా చౌరస్తా వద్ద సోమవారం ఈ ఘటన చోటు చేసుకున్నది. టూ టౌన్ సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్‌కు చెందిన ట్రాక్టర్ రంగధాంపల్లి వైపు వెళ్తుండగా అకస్మాత్తుగా టైరు పంక్చర్ అయ్యింది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ మెల్లిగా పక్కకు తీసుకుంటుండగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రాము(35), అతడి బంధువు శ్రీనివాస్ ఇద్దరు ఆటోపై వేగంగా వచ్చి ట్రాక్టర్ వెనుక భాగంలో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ రాము అక్కడికక్కడే మృతి చెందగా అతడి బంధువు శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సమాచారమందుకున్న టూ టౌన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని తీవ్ర గాయాలైన శ్రీనివాస్‌ను చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాము మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు తెలిపారు.


ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన ఆటో

రాగి ఆకుపై రామభక్తి



అయోధ్యలో రాంలల్లా విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా సిద్దిపేటకు చెందిన సిరిసిల్ల రోహిత్ అనే చిత్రకారుడు రావిచెట్టు ఆకుపై శ్రీరాముడు, సీతాదేవి, హనుమ చిత్రాలను వేసి తన భక్తిని చాటుకున్నాడు. కొన్నేళ్లుగా రావిచెట్టు ఆకుపై పలు చిత్రాలను వేసి అందరి చేత మన్ననలు పొందుతున్నాడు.

- సిద్దిపేట టౌన్, జనవరి22

వీరన్నపేటలో శివాంజనేయస్వామి ఆలయానికి భూమిపూజ


భూమిపూజలో పాల్గొన్న సర్పంచ్ భిక్షపతి, గ్రామస్థులు

చేర్యాల, జనవరి 22 : చేర్యాల మండలం వీరన్నపేట గ్రామంలో నిర్మించతలపెట్టిన శివాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం భూమిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచు కొండపాక భిక్షపతి, ఎంపీటీసీ శివశంకర్, ఇస్కాన్ టెంపుల్ ఇన్‌చార్జి అరిగె శ్రీనివాస్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణం త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని నిర్వాహకులు తెలిపారు.

ముస్త్యాలలో నూతన జీపీ భవనం ప్రారంభం


జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ముస్త్యాల సర్పంచ్ ఎల్లారెడ్డి

చేర్యాల, జనవరి 22: మండలంలోని ముస్త్యాలలో ఇటీవల నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని సోమవారం గ్రామసర్పంచు పెడుతల ఎల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం కోసం గత ప్రభుత్వం నూతన పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణాలకు చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచు రవితేజ, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు ప్రమోషన్‌లు వెంటనే చేపట్టాలి



కుకునూరుపల్లిలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కొండపాక, జనవరి 22: ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు వెంటనే చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.యాదగిరి ప్రభుత్వాన్ని కోరారు. టీఎస్ యూటీఎఫ్ కుకునూరుపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో క్యాలెండర్ ఆవిష్కరణతో పాటు సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలన్నారు. తద్వారా ఉన్నత పాఠశాలలో సైతం విద్యార్థుల నమోదు శాతం పెరుగుతుందన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రమోషన్లు కల్పించి బదిలీలు చేపట్టాలని పేర్కొన్నారు.

తపాస్‌పల్లి రిజర్వాయర్ నీటితో చేర్యాల చెరువులను నింపాలి

చేర్యాల, జనవరి 22: తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోని గోదావరి జలాలలో చేర్యాల ప్రాంత చెరువులు, కుంటలు నింపాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్ పేర్కొన్నారు. చేర్యాల మండలకేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెట్ట ప్రాంతమైన చేర్యాల ప్రాంత చెరువులలో నీటిమట్టం అడుగంటిపోతుంటడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొన్నందున ప్రాధాన్యతగా నీటిని మళ్లించాలన్నారు. గజ్వేల్, కొండపాక మండలాలకు అక్రమంగా నీటిని తరలిస్తుండటాన్ని అడ్డుకుంటామన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నీటితరలింపుపై స్పందించాలని కోరారు. సమావేశంలో నాయకులు ఈరు భూమయ్య, జంగిలి యాదగిరి, తిగుల్ల కనకయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మంగోల్ సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలి

కొండపాక, జనవరి 22 : గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను సొంత అవసరాలకు వాడుతున్న మంగోలు గ్రామ సర్పంచ్ కిరణ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన సుదర్శన చారి అనే వ్యక్తి గ్రీవెన్స్ సెల్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. సర్పంచ్ తన సొంత భూమిలో గ్రామపంచాయతీ ట్రాక్టర్‌తో పనులు చేసుకుంటున్న విషయాన్ని మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఫిర్యాదులో ఆరోపించాడు.

కోలోయాప్‌లో డాటా ఎంట్రీపై అవగాహన

మద్దూరు, జనవరి 22: మద్దూరు మండల కేంద్రంలోని జాగృతి సమాఖ్యలో సోమవారం మహిళా సంఘాల సభ్యుల డాటా ఎంట్రీపై డీఎంజీ ప్రసాద్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డాటా ఎంట్రీ పనుల నిర్వహణపై డీఎంజీ ప్రసాద్ మాట్లాడారు. లోకో యాప్‌లో మహిళాసంఘాల సభ్యులు ఆధార్, బ్యాంకు అకౌంట్ వివరాలను ఎలా పొందుపర్చాలి అనే అంశాలతో పాటు ఎస్‌హెచ్‌జీల డాటా ఎంట్రీ పనులు ఏవిధంగా నిర్వహించాలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు సిద్దిమల్లయ్య, మహేందర్, ప్రేమలత, నర్సయ్య పాల్గొన్నారు.

తంజీముల్ మసాజిద్ నూతన కార్యవర్గం

సిద్దిపేట టౌన్, జనవరి 22: తంజీముల్ మసాజిద్ నూతన కార్యవర్గాన్ని సోమవారం సిద్దిపేట పట్టణంలోని మదీనా ఫంక్షన్‌హాల్‌లో ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు జియావుద్దీన్ ఆసిఫ్ తెలిపారు. వీరిలో సిద్దిపేట అధ్యక్షుడిగా జియావుద్దీన్ ఆసిఫ్, ఉపాధ్యక్షుడిగా షేక్ ఉబేద్, తంజీమ్ గౌరవ అధ్యక్షుడిగా అలీం సర్వర్, గౌరవ ఉపాధ్యక్షుడిగా గౌస్ మైనొద్దీన్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు